


(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

# -150-

(15 జూన్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

"పొట్టకోసం పుట్టెడు బుద్ధులు"

"నాలుగు వ్రేళ్ళూ లోపలికి పోవడానికి నానా తిప్పలు."

"కంచం వాల్చడం కోసం అంతులేని సంచనలు"

"ఉదర పోషనార్థం బహుకృత వేషాలు"

ఇలా ఎన్నెన్నో సామెతలున్నాయి కడుపు నింపుకోవడమనే బృహత్కార్యం కోసం. ఆరగా ఆరగా అంత పడేస్తూవుంటే గాని ఆత్మారాముడు చల్లారదు. లేకపోతే "అంతా తిండిమయం జగమంతా తిండిమయం" అనే స్థితికి వస్తుంది.

మహారాజు దగ్గిర నుంచి మాదాకళమెత్తుకునేవరకూ 'పట్టెడు మెతుకుల సమస్య వుంది రుచులమాట ఎలా వున్నా' కొందరు అదృష్టవంతులు రొట్టెలు వేసుకుంటూ తింటారు. కొందరు పొట్టలో అగ్నిని చల్లార్చడం కోసం పది ముద్దలు లోపల పడేసి ఆ పదిముద్దలకీ వందమాట్లు భగవంతుణ్ణి తలుచుకుంటారు.

"తిండికోసం పెళ్ళాడితే

మొండి వయ్యావే...

ఖండి వయ్యావే.."

అని ఒక ఇల్లాలు బాధపడుతుంది. అంటే అన్ని పరమార్థాల కన్నా ముందు ఇంత అన్నం పెట్టి పోషిస్తాడనే భర్తను నమ్ముకోవడం అని దీని సారాంశం.

పూర్వం కందములాలు భుజించి జీవితమంతా వెలుగుతోటగా గడుపుకునేవారు. ఇప్పుడెన్ని మూలాలున్నా చాలడం లేదు. రకరకాల భోజనాలు, రకరకాల పానీయాలు ఎన్నో అవతరించాయి. మొన్న చూశాను. కట్టెలు కొట్టేవాళ్ళుకూడా కాఫీ ఫ్లాస్కు దగ్గర పెట్టుకుని గంటకోసారి త్రాగుతున్నారు.

పూర్వం ఇంత చద్ది అన్నం తిని వచ్చి పనులు చేసుకునేవారు. కష్టజీవులు గనుక కొంతసేపటికి అలసట ఏర్పడి ముఖాలు ముద్దమందారంలాగా తయారయ్యేవి. ఇప్పుడు అంత కష్టపడేవారు కూడా నాజూకు ఆహారాలకు అలవాటై పోయారు.

మొత్తం మీద కడుపు నింపుకోవడం ఒక పెద్ద సమస్య అయిపోయింది. ధాన్యం పండించడమనే మహా క్రతువు ఒక ప్రక్క కొనసాగుతున్నా ఒక ప్రక్క క్షుద్బాధ అంతరించడమేలేదు. కృత్రిమ ఆహారాలకు ప్రాధాన్యం రావడం వల్ల ఈ చిక్కు మరింత క్లిష్టదశలోకి వచ్చింది.

శ్రీరాములు సీతాదేవిని వనంలో దింపినప్పుడు ఆమె అదృష్టవశాత్తు వాల్మీకి మహర్షి ఆశ్రమానికి చేరినప్పుడు ఆదుకుంటాడు.

"కలమాన్నములు పెట్టగలేమోమోగాని, కందమూలములకేమీ కరువులేదు" అని. ప్రకృతి సిద్ధమైన ఆహారంతో జీవించడం అలవరుచుకున్నప్పుడు ఒక పట్టమహిషికి కూడా ఆతిధ్యమిచ్చి గౌరవించే స్థితి, ఔదార్యం వారిలో వుండేది.

ఇప్పటి రోజుల్లో చుట్టాలు యింటికి వస్తే సుళ్ళు తిరిగిపోవలసిందే. ఆ కందమూలముల సాంప్రదాయం ఇప్పుడూ కనిపిస్తోంది బంగాళా దుంపల్లో. ఎవరన్నా రానివ్వండి, ఏ వేళప్పుడన్నా రానీయండి. బంగాళాదుంపలు ఉడకేసి వారి విస్తట్లో గిరాటు వేస్తే గృహస్థుడు రాజసూయ యాగం చేసినంత సంతృప్తి. అతిధికి సంజీవి పుడక త్రుంచి నమిలించినంత సంతోషం. పచ్చడి మెతుకులతో భోజనం పెట్టిన భార్యవంక చూచి భర్త అన్నాడు "ఏం ఇవ్వాళ ఇంట్లో ఏం కూరా తగలడలేదా?" అని.

ఆవిడ ముఖం చిట్లించి "తగలడితే ఉడకబెట్టే దాన్నేగా? గుండెలు బరువెక్కేటట్లు పచ్చడి బండతో కుస్తీ దేనికి?" అని కొంచెం సేపు ఆగి "పది బంగాళదుంపలున్నాయి. ఏవేళప్పుడు ఎవరు దిగుతారోనని అలా వుంచాను" అంది.

"ఏం ఏవైపువాళ్ళెవరన్నా వస్తానని కబురంపారేంటి?" అని ఆయన ప్రశ్న.

"నావైపు వాళ్ళు కబుర్లు పంపడం కూడానా, కాకి కబుర్లేగతి. అంత ముందుగా కబురు పంపడానికి వాళ్ళదేం ఆఫీసర్ల క్యాంపా? బందిపోట్ల గుంపా?" అని ఆవిడ తిరుగు ప్రశ్న.

చెప్పవచ్చిందేమిటంటే, ఈ రోజుల్లో అతిధి మర్యాదలు అతి విచిత్రమైన రూపాలు దాలుస్తున్నాయి. అవి గార్హస్త్య ధర్మాలకు గల పర్మితుల్ని దాటి శుష్కప్రియ విపంచి స్వరాలు మీటి ఏవేవో కృత్రిమ రాగాలు వినిపిస్తున్నాయి.

కొందరు వచ్చి వారివారి అలవాట్లు ఏకరువు పెడుతూ వుంటారు. కొందరు భార్యలచేత చెప్పిస్తూ వుంటారు. "మావారు వట్టి పప్పు తినరు. కలగలుపు వుండాలి. ఉడకేసిన కూరలు తినరు. బొత్తిగా పడకవేసినప్పుడు తప్ప. పులుసు అట్టే నచ్చదు. నిమ్మకాయ చాలా కావాలి. అన్నట్టు మజ్జిగలో అప్పడాలు నంచుకుంటారు. తిని లేవగానే అదేలెండి, ఒక అరగంట తర్వాత అనుకొండి గ్లాసుడు బత్తాయి రసం త్రాగుతారు.

ఈ జాబితా వింటుంటే గృహ యజమానులు గుండెలమీద తాచుపామునుంచినట్లవుతుంది, మూర్ఛపోవాలనిపిస్తుంది గాని లేవదీసే వాళ్ళూ, ముఖాన చన్నీళ్ళు చల్లేవాళ్ళూ వుండరని తెలిసి వూరుకుంటారు.

అలాటి పరిస్థితుల్లో భర్త వంటింట్లోకి పోతాడు. భార్యను చూసి జాలిపడటానికి. అతిధికి మర్యాద చెయ్యక తప్పదని చెప్పడం కోసం ప్రయత్నిస్తాడు. మొదటగా "వచ్చినవాడు దాష్టికుడు" అని ఎత్తుకుంటాడు. "పొరిగింట సూచనలు" తప్పంటారు పెద్దలు. ఆ ఇంటి ఆడబడుచైతే తప్ప అలా ఏమీ సూచనలు చేసే అవకాశం వుండదు. కాని వాళ్ళు తమకు కావలసింది చెప్పడం "పొరుగింటి మాడిదం" ప్రకరణం క్రిందనేవస్తుంది.

చెప్పవచ్చిందేమంటే మానవుడి ప్రతి నిత్యం వెన్నుతట్టి ఇంట్లో కూర్చోనివ్వకుండా, బయటికి నెట్టే సమస్యల్లో ఆహార సమస్య ముఖ్యమైంది. బియ్యం బస్తాలు మూలుగుతూ పడివుండే ఇళ్ళు కొన్ని లేకపోలేదు. కాని తెల్లారితే ఖాళీ డబ్బాలు తూలి పడిపోయే ఇళ్ళెన్ని  వున్నాయో

ఏపూట కాపూట మానెడు బియ్యం కోసం, బయ్టకు బయలుదేరే ప్రాణాలెన్ని వున్నాయి. ఇవన్నీ ఆ పూటకే టికాణా లేని జీవితాలు. ఇక భోగాలకేం వుంటుంది అవకాశం. అలాంటప్పుడు వారికి కనిపించేది శూన్య ఆకాశమే.

ప్రభుత్వం ఆహార పద్దతుల్లో మార్పులనీ, వోర్పులనీ అనవసర సమయాలలో నేర్పులనీ ఎన్నెన్నో ప్రకటనలు చేసింది. ఆహార రగడలో 'సంతాన ప్రాప్తికి ' కూడా ఉమ్మేడా పెట్టి కూర్చోపెడుతున్నారు.

ఆ మధ్య ఎవరో ఒకామె అందిట. "నాకు జాతకంలో తొమ్మండుగురు పిల్లలని వుందిట. మరి 'ముగ్గురి'తో నే సరిపెట్టుకోమంటోంది దేశం. ఇది ఎలా తేలుతుంది కుటుంబనియంత్రణ పాటించని ఏ దేశానికో పారిపోయి పెళ్ళి చేసుకుంటే తప్ప, నా జాతకం నిలిచేటట్లు లేదు" అని.

అహార సమస్య అష్టవక్ర దశలూ కల్పిస్తోంది సంఘంలో. ఈ సమస్య పూర్తిగా పరిష్కారమయ్యేదెలా?  ఈ విషయంలో ఒక ప్రముఖుడు చేసిన సూచనలు ఈసారి వ్యాసంలో వివరిస్తాను.

Post your comments